క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలి

జమ్మలమడుగు రూరల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవి జ్ఞానాన్ని పొంది ఒత్తిడికి స్వస్తి పలకాలని ఏపీహెచ్‌డీసీ మాజీ చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళిలు తెలిపారు. శనివారం పట్టణం లోని ఎంపీ మునిరెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం లో న్యాయవాది సూర్యపెద్దిరాజు, రంగనాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ



సుధీర్‌రెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అనారోగ్యంగా ఉండటంతో శనివారం నిడిజివ్విలో కడప జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా తదితర నాయకులు ఆయనను పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకున్నారు.

తొయ్యండి బాబు తొయ్యండి



మొరాయించిన బస్సును తోస్తున్న ప్రయణికులు

పులివెందుల రూరల్ : కూటమి సర్కారు మహిళలకు ఉచిత బసు ప్రయాణం ప్రారంభించి 24 గంటలు కాక ముందే ప్రభుత్వ ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోనే మొరాయిస్తున్నాయి. శనివారం పులివెందుల ఆర్టీసీ బస్టాండ్‌లో తాడిపత్రి డిపోకు చెందిన ఏపి02జడ్0277 నంబరు గల బస్సు మొరాయించడంతో అక్కడున్న ప్రయాణికులతో డ్రైవరు తొయ్యండి బాబు తొయ్యండి అంటు వేడుకున్నారు. దీంతో ప్రయాణికులు జాలి చూపి బస్సును తొయ్యడంతో డ్రైవరు స్టాట్ చేసుకుని అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

మానవత్వాన్ని చాటిన మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్



అంత్యక్రియలను నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో ఉంటున్న అలిశెట్టి లక్ష్మీ (69) అనారోగ్యంతో మరణించడంతో మే ఐహెల్ప్‌యూ ఫౌండేషన్ నిర్వాహకులు మానవత్వాన్ని చాటారు. ఆమె అంత్యక్రియలకు ఎవరు ముందుకు రాకపోవడంతో స్థానికులు ఫౌండేషన్ అధక్ష్యుడు అహమ్మద్ హుసేన్‌ను సంప్రదించారు. స్పందించిన ఆయన హిందూ సంప్రదాయం ప్రకారం ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పౌండేషన్ చైర్మన్ మోరే అక్షుణ్, సభ్యులు భార్గవ్, సాయి, మునిసాయి కృపా, సుమన్ బాబు, ప్రసన్నకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాజపేయికి బీజేపీ నేతల నివాళి



వాజ్‌పేయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో గల వాజ్‌పేయ్ సర్కిల్ ఉన్న అటల్ బిహారీ వాజపేయి విగ్రహానికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు పుప్పాల శ్రీధ్‌రెడ్డి, నాయకులు కందుల మురళి మోహన్‌రెడ్డితోపాటు ఇతర నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ నాయుడు, గోసుల శ్రీనివాసులరెడ్డి, చాగల మర్రి ఓబులేసు, పవన్, సురేంద్ర,శివ నాయక్, లక్ష్మణ్ రావు, రమణ రెడ్డి, ప్రభు కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయకృష్ణా.. ముకుందా... మురారి

పులివెందుల టౌన్ : పట్టణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భాకరాపురం సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో ఉదయం విశేష అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ముగ్ధమోహన రూపంగా వివిధ రకాల పూలతో అలంకరించారు. జయ కృష్ణా ముకుందామురారి అంటూ భక్తిపారవశ్యంతో ఆరాధించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ పరమాత్మ కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అనంతరం ప్రాకారోత్సవం, విశేష నక్షత్ర హారతి, ఏకాంత సేవ కార్యక్రమాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయం, అమ్మవారిశాల, గీతామందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు సత్యభామ, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : అప్పరాజుపల్లిలోని శ్రీకృష్ణ దేవాలయం, బుగ్గలపల్లిలో, ఊటుకూరు భగత్ సింగ్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి విశేష అలంకారం నిర్వహించి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయమే స్వామివారికి పంచామృతాభిషేకం నివేదన, మహా మంగళహారతి, శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, అమ్మవార్లకు కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు.



పులివెందులలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



పులివెందులలో కోలాటం ఆడుతున్న మహిళలు

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె శ్రీ శివకృష్ణ గోశాల, వీరపునాయునిపల్లె ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని కృష్ణాలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శివకృష్ణ గోశాలలో గోమాతలకు పూజలు నిర్వహించడంతో పాటు మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. భగవద్గీత పారాయణం, భజన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొండూరు మండలం బూసుపల్లె గ్రామస్తులచే ఏర్పాటు చేసిన కోలాట కార్యక్రమం భక్తులను అలరించింది. గోశాలలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టు కార్యక్రమంలో పురుషులతో పాటు మహిళలు పోటీ పడ్డారు. మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథ్‌రెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి కల్లూరు రాజశేఖర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కొండాపురంలో..

కొండాపురం : మండల పరిధిలోని విద్యాలయాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి జన్మదినం పురస్కరించుకుని చిన్నారులు శ్రీకృష్ణ, గోపిక అలంకరణలతో దర్శనమించారు. అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టారు.

లింగాలలో..

లింగాల : రామనూతనపల్లిలో శనివారం శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో స్వామివారి విగ్రహానికి అర్చనలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలను చేశారు. అనంతరం భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని కూడలిలో చెట్టుకు ఉట్టిని గట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు గోపిక వేషధారణలో బాలురు శ్రీకష్ణ వేషధారణలో భక్తులను గ్రామ ప్రజలను అల్లరింపజేశారు. కార్యక్రమంలో రామన్నపల్లి, చిన్నకుడాల, గుణకణపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి శ్రీకృష్ణుని దర్శించుకున్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక వడ్డెర వీధిలో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయంలో విద్యార్థులు నృత్య ప్రదర్శన చేపట్టారు. శనివారం శ్రీకష్టామీ సందర్భంగా వేంపల్లెలోని వడ్డెర వీధిలో వెలసిన కష్ణుడి ఆలయంలో వేంపల్లెలోని కవి డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమం చేపట్టారు. అలాగే విద్యార్థులు చేసిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయం కమిటీ అధ్యక్షుడు డేరంగుల రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులు

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకస్వామి విజయరంగ నాయకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వ హించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణాన్ని అర్చక స్వాములు పార్థసారధి బట్టర్, ఆంజనేయులు, విజయరంగ నాయకులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. మైదుకూరు కళాకారులచే కోలాటం, దుగ్గపల్లి వారిచే చక్క భజన కార్యక్రమం, రాత్రి నంద్యాలపల్లి వారి చే తాళాల భజన నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



లింగాలలో ప్రత్యేక అలంకరణలో శ్రీకష్ణుడి విగ్రహం



కొండాపురంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



సింహాద్రిపురంలో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



సింహాద్రిపురంలో కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



చింతకొమ్మదిన్నెలో కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



సంగాలపల్లె గోశాలలో ఉట్టికొడుతున్న యువకులు

ఘనంగా హనుమంతుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి



భక్తులను అలరించిన కోలాటం

వీరపునాయునిపల్లె : నాలుగో శనివారం సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువజామున్నుంచే భక్తులు ఆలయనానికి చేరుకొని స్వామికి ఆకుపూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపించారు. ఉదయం 9 గంటల నుంచి ఆలయ ప్రాంగనంలో నిర్వహించిన హోమ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గండికి కాలినడకన వెలుతున్న భక్తులకు సంగమేశ్వర విద్యా సంస్థల అధినేత, ఆలయ ధర్మకర్త ఒంటిగారి వెంకట సుబ్బానాయుడు బోజనం ఏర్పాటు చేశారు. కోలాట కార్యకర్మం అలరించింది.

దివ్యాంగులకు స్కూల్ బ్యాగ్స్ వితరణ

పులివెందుల టౌన్ : గంగిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, డాక్టర్ ఇరికిరెడ్డి అభిలాష్ రెడ్డిలు దివ్యాంగులకు బ్యాంకెట్స్, స్కూల్ బ్యాగులను వితరణగా అందజేశారు. ప్రతియేటా దివ్యాంగులకు సహాయసేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని రిటైర్డ్ డిగ్రీకళాశాల అధ్యాపకుడు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బ్లాంకెట్స్, స్కూలు బ్యాగులను మాధ్యమిక భవిత కేంద్రంలో చదువుకుంటున్న మానసిక వికలాంగులైన విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం స్వీట్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య, శీలం సునీల్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు బ్యాగులు అందజేస్తున్న రిటైర్డ్ అధ్యాపకుడు చంద్రశేఖర్‌రెడ్డి

వాహనాలకు పత్రాలు లేకపోతే సీజ్ చేస్తాం

వేంపల్లె : వాహనాలకు సరైన పత్రాలు లేకపోతే అలాంటి వాహనాలను సీజ్ చేస్తామని సీఐ నరసింహులు తెలిపారు. శనివారం స్థానిక రాయచోటి బైపాస్‌లో వాహనాలను సీఐ నర్సింహులు తనిఖీ చేసి సరైన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారికి జరిమానాలు విధించారు. వాహనాలు నడిపే వారు సరైన రికార్డులు పెట్టుకుని వాహనాలను నడపాలని కోరారు. మోటర్ బైకులో వెళ్లి వారు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. చిన్న పిల్లలకు మోటర్ బైకులను ఇవ్వరాదన్నారు. అతి స్పీడ్‌గా వెళ్లడంతో యాక్సిడెంట్‌లు జరుగుతాయన్నారు.



వాహనదారులకు సూచనలిస్తున్న సీఐ నరసింహులు

23 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 28వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఒంగోలు నగరంలో జరగనున్నాయని ఆ పార్టీ నగర కార్యదర్శి యస్.వెంకటశివ పేర్కొన్నారు. 23వ తేదీన జరిగే ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. శనివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నగర జోన్ సమితుల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అయినప్పటికీ ప్రజల జీవన పరిస్థితుల్లో ముఖ్యంగా కష్టజీవులైన కార్మిక, రైతాంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ, అసంఘటిత రంగాల వారిలో మెరుగైన మార్పులేమీ కనపడలేదన్నారు. ఈ పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలను ప్రోత్సహిస్తూ లక్షలాది రూపాయలు వారికి రాయితీల రూపంలో అందిస్తూ, ప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నాయన్నారు. పోరాటాలతోనే పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలన్నారు. 23వ తేదీన ఒంగోలులో జరిగే ర్యాలీ, భారీ బహిరంగ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, తెలంగాణ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు బ్రహ్మం, మల్లికార్జున, మునెయ్య, భాగ్యలక్ష్మి, యేసు రత్నం, జయరామయ్య, పక్కీరప్ప, నరసమ్మ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ

నేవీ ఉద్యోగికి సీజీసీ మెడల్

కలసపాడు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన పాలకొలను నారాయణరెడ్డి, వీరమ్మల కుమారుడు రమణారెడ్డి నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో భారత నావీ సిబ్బంది సాహసోపేతంగా పాకిస్థాన్ సముద్ర జలాల్లో చిక్కుకున్న మన దేశ జాలర్లను రక్షించారు. రమణారెడ్డి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా ఆయనకు సీజీసీ మెడల్‌ను బహుకరించారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

పోరుమామిళ్ల : ఉద్యోగ ఉపాధ్యాయులకు 5 డీఏలు, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.వి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యంతర భృతి ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని ఆయన కోరారు. 2022 నుంచి ఈఎల్ బకాయిలు ఇంతవరకు జమ కాలేదన్నారు. అసిస్మెంట్ బుక్లెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఆర్యవైశ్య వర్తక సంఘం చైర్మన్

పోరుమామిళ్ల : బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘం చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన కె.సి.సుబ్బారావు శనివారం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యా దపూర్వకంగా కలసి సత్కరించారు. అనంతరం చైర్మన్‌గా ఎన్నికైన సుబ్బారావును అభి నందిస్తూ ఎమ్మెల్సీ ఆయనను సన్మానించారు. ఆర్యవైశ్యులు నాగరాజారావు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సాయి కుమార్, నాగరాజా పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణ శనివారాలు

పులివెందుల టౌన్ : శ్రావణ మాస నాల్గవ శనివారం సందర్భంగా అంజన్న ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రావణమాసం చివరి శనివారం కావడంతో పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి ఆలయం, పీడబ్ల్యూ కాలనీ, కోతి సమాధి ఆలయం అభయాంజనేయస్వామి ఆలయం, పాత మార్కెట్ పడమటి ఆంజనేయస్వామి, ఆర్‌ఆర్ లేఔట్ అభయాంజనేయస్వామి, అడ్డగుట్ట ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ఆకు పూజలు నిర్వహించి కాయ, కర్పూరం సమర్పించారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



పూజలందుకుంటున్న అడ్డగుట్ట ఆంజనేయస్వామి

దారి పొడవునా అన్నదాన శిబిరాలు

వేంపల్లె : శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా నాలుగో శనివారం గండి క్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. దీంతో గండికి వెళ్లే భక్తుల కొరకు వేంపల్లెలోని రాయచోటి బైపాస్ వద్ద నుంచి గండిక్షేత్రం వరకు దారి పొడవున అన్నదాన శిబిరాలను దాతలు పెట్టి గండికి వచ్చే పోయే వారందరికి పిలిచి, పిలిచి అన్నదానం చేశారు. రాయచోటి బైపాస్‌లో ఆకు తోట రైతులైన బాబావలి, సయ్యద్ వలి, పఠాన్ టోపి, సిరిగిరెడ్డి ఆంజనేయులు, కమాల్, రామచంద్ర, వేంపల్లెకు చెందిన మహేష్, రామకష్ణ, బాలచంద్రారెడ్డి, కల్లూరి శివ, మల్లికార్జున, కారుపురెడ్డిపల్లెకు చెందిన వెంకట సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన రామ పుల్లయ్య, దాసరి మహేష్, వేంపల్లెకు చెందిన మానవతా సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, శారద పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సలీం, గాలి హరిప్రసాద్ అనే దాతలు భక్తులకు అన్నదానం, అల్పాహారం కార్యక్రమాలు చేపట్టారు. అలాగే గండికి వెళ్లే వారికి తాగునీరు, మజ్జిగ, అరటి పండ్లను పంపిణీ చేశారు. ఉదయం అల్పాహారాన్ని పెట్టారు. వేంపల్లె మీదుగా కాలినడకన వీరపునాయునిపల్లె, వేముల, పులివెందుల, పెండ్లిమర్రి, మండలాల నుండి చాలా మంది భక్తులు కాలినడకన గండికి వెళ్లి శ్రీవీరాంజనీయ స్వామిని దర్శించుకున్నారు. అయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించి కాలినడకన వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.



అన్నదానం చేస్తున్న భక్తులు

పెన్షన్ల తొలగింపు ప్రక్రియను వెంటనే ఆపాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వికలాంగుల పెన్షన్లు తొలగించే ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ఆపాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్లఓబులేసు కోరారు. శనివారం స్థానిక రెడ్డెయ్యమఠం వీధిలోని దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీవెరిఫికేషన్ పేరుతో లక్షల సంఖ్యలో వికలాంగ పెన్షన్లు తొలగించడం దారుణమన్నారు. 2010లో సదరం సర్టిఫికెట్ ద్వారా వైకల్య ధృవీకరణపత్రాలు పొందిన అర్హులకు సైతం రీవెరిఫికేషన్ పేరుతో పెన్షన్లు తొలగించడం సరికాదన్నారు. అంగవైకల్యంతో ఏ పని చేసుకోలేక పెన్షన్‌పైనే ఆధారపడి ఉన్న వికలాంగులకు ఉన్నపలంగా పెన్షన్ తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రీవెరిఫికేషన్ పేరుతో పెన్షన్లు తొలగించే ప్రక్రియను తక్షణమే ఆపాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఏరియా అధ్యక్షుడు బాలరాజు, పట్టణ అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షుడు మౌలాలి, గౌరవ సలహాదారుడు మురళి, సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

మైదుకూరు : సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మైదుకూరులో మహాసభల గోడ పత్రికలను సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒంగోలు పట్టణంలో ఈనెల 22 నుంచి మూడు రోజులపాటు సీపీఐ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ మహాసభలకు మైదుకూరు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్మికులు, కర్షకులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు వేలాది మందితో మహా ప్రదర్శన అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారని, 24, 25 తేదీలలో ప్రతినిధుల సభలు జరుగుతాయని వివరించారు. మహా సభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.